సాక్షి
జగిత్యాల
బుధవారం । 21 । ఆగస్టు । 2024



పరిహారంపై అన్నదాతల్లో ఆందోళన

జిల్లాలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌-63) విస్తరణలో భాగంగా చేపట్టే బైపాస్‌ల నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. 8లో▸



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

డ్రైయినేజీ ముప్పు

- మరమ్మతు లేకపోవడంతో శిథిలావస్థకు..
- వర్షం వస్తే లోతట్టు కాలనీలన్నీ జలమయం
- ఎక్కడికక్కడ ఉప్పొంగుతున్న నాలాలు
- ఇళ్లలోకి వస్తున్న మురుగు నీటి ప్రవాహం
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు



ఈచిత్రంలో కనిపిస్తున్నది బైపాస్‌రోడ్‌లోని ప్రధాన డ్రైయినేజీ. ఇది సక్రమంగా లేకపోవడంతో వర్షం పడితే చాలు ఉప్పొంగి ఆ రోడ్డు మొత్తం నీటితో జలమయం అవుతుంది. సుమారు 2నుంచి 3 గంటల పాటు నీరు అలాగే నిలిచి ఉంటోంది. రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో స్కూల్ పిల్లలు, వాహనదారులు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు డ్రైయినేజీకి మరమ్మతు చేపట్టి నీరు సక్రమంగా వెళ్లేలా చూడాల్సిన అవసరం ఉంది.



ఇది జిల్లా కేంద్రంలోని అతిపెద్ద నాలా. జిల్లాకేంద్రం మధ్యలో దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఉంటుంది. అక్కడక్కడ డ్యామేజీ కావడంతో ఇటు నాలానీటితో పాటు వర్షపునీరు వస్తే ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. అందులోనే చెత్తాచెదారం వేస్తుండడంతో నీరు వెళ్లడం లేదు.



ఇది గోవిందుపల్లికి వెళ్లే రోడ్, బైపాస్‌రోడ్ సమీపంలోని డ్రైయినేజీ. ఈ ప్రాంతంలోనే అతి ప్రధానమైనది. అయినప్పటికీ ఇప్పటివరకు కనీస మరమ్మతు చేపట్టలేదు. అందులో పూర్తి పిచ్చిమొక్కలు, పాలథిన్ కవర్లతో నిండిపోయింది. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో అందులోని నీరు ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి.



ఈ చిత్రం జంబిగద్దె నుంచి మోతె చౌరస్తా వరకు ఉన్న డ్రైయినేజీ. నాలా సక్రమంగా లేకపోవడంతో ఈ చౌరస్తా అంతా నీటితో ప్రవహిస్తోంది. డ్రైయినేజీలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు ఇతరత్రా వేయడంతో ఆ కాలనీ అంతా దుర్గంధం వస్తోంది. వర్షం పడిందంటే ఎక్కడ వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జగిత్యాల: జిల్లా కేంద్రంలో డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వర్షాలకు రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా ఉన్న డ్రైయినేజీల్లో షాపుల యజమానులు, నిర్వాహకులు, హోటల్ వారు అందులోనే పాలిథిన్ కవర్లు, చెత్తాచెదారం, చికెన్ వ్యర్థ పదార్థాలు వేయడంతో అవన్ని నిండటంతో డ్రైయినేజీలోకి నీరు వెళ్లలేని పరిస్థితి. దీంతో వర్షం పడటంతోనే డ్రైయినేజీలోకి నీరు వెళ్లకపోవడంతో ప్రధాన రహదారులపైకి వచ్చి అత్యంత స్పీడ్‌గా వాటర్ రావడంతో రోడ్డుపై వాహనాలు కొట్టుకుపోవడంతోపాటు, ఇళ్లలోకి వచ్చి సామగ్రి సైతం పూర్తిగా తడిసిపోతోంది. దీంతో ప్రజలంతా భయాందోళనకు గురవుతున్నారు. ఈ డ్రైయినేజీల్లోంచి వస్తున్న నీరు రోడ్లపైకి రావడంతో సముద్రాలు తలపిస్తున్నాయి. అందులోంచి నడుచుకుంటూ వెళ్లాలన్నా.. వాహనంపై వెళ్లాలన్నా ఎక్కడ పడిపోతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంకావడం, అతిపెద్ద మున్సిపాలిటీ అయినప్పటికీ డ్రైయినేజీల మరమ్మతు చేపట్టడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లోతట్టు ప్రాంతాల పరిస్థితి ఎలా..?

జిల్లా కేంద్రంలో బుడిగ జంగాలకాలనీ, నాగేంద్రనగర్, జాంబాగ్‌తోపాటు పలు కాలనీలు లోతట్టుగా ఉంటాయి. డ్రైయినేజీలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి వస్తున్న నీరు సైతం ఈ లోతట్టు ప్రాంతంలోకి చేరుతుంది. ఒకవేళ రాత్రివేళలో వర్షం భారీగా కురిస్తే మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఇది బైపాస్‌కు ఆనుకుని ఉన్న మహాలక్ష్మీ నగర్ రోడ్. ఈ డ్రైయినేజీ చెత్తతో నిండిపోయింది. ప్రమాదం జరగకుండా ఇనుపచువ్వలు ఏర్పాటు చేసినా డ్రైయినేజీ సక్రమంగా లేక అందులోని నీరు కాలనీ మొత్తం నిండిపోతోంది. ఆ గల్లీలో ఉన్న ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మహాలక్ష్మీనగర్ పూర్తిగా లోతట్టు ప్రాంతం కావడంతో డ్రైయినేజీ నీరంతా ఇళ్లలోకి వెళ్తోంది.

చర్యలు చేపడుతున్నాం

డ్రైయినేజీలకు మరమ్మతు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. వాటికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ డ్రైయినేజీలు దెబ్బతిన్నాయి..? మరమ్మతు ఎంత వరకు చేపట్టాలి..? అన్న దానిపై సర్వే చేస్తున్నారు. త్వరలోనే అన్ని చర్యలు తీసుకుంటాం.

– యాదగిరి, జగిత్యాల మున్సిపల్ డీఈ

న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీదేవి, విశ్వక్సేన, ఆంజనేయస్వామి నూతన ఉపాలయాల ద్వారపాలక, రాజగోపుర శిఖరం, విమాన శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మూడు రోజుల పాటు పూజాకార్యక్రమాలు ఉంటాయని, 22న ముగింపు రోజు భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పుప్పాల ప్రభాకర్, కౌన్సిలర్లు గంగాధర్ గౌడ్, నాగభూషణం, ఆలయ ఈఓ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కుజదోష నివారణ పూజలు



కుజదోష నివారణ పూజల్లో భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు చేసింది శూన్యం



రైతులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్: పదేళ్ల పాలనలో రైతులకు ఏమీ చేయని బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడాన్ని జీర్ణించుకోలేకపోతోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో రుణమాఫీపై సమీక్షించారు. ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. జిల్లాలో 3 విడతల్లో కలిపి 69,673 మందికి రూ.5,323 కోట్ల రుణమాఫీ అయ్యిందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 25,706 మందికి రూ.181 కోట్లు మాఫీ చేసినట్లు తెలిపారు. మాఫీ కాని రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని, 10 పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఏవో కరుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'సహకార' కార్యాలయంలోకి వరద నీరు

- తడిసిన బియ్యం, ఎరువుల బస్తాలు



తడిసిన బియ్యం బస్తాలు

జగిత్యాలఅగ్రికల్చర్: సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలోకి వర్షం నీరు చేరింది. లాకర్ గది, ఎరువుల బస్తాలు నిల్వ చేసిన గోదాం, బియ్యం బస్తాలున్న గదిలోకి నీరు భారీగా చేరింది. బస్తాలన్నీ పూర్తిగా తడిసిపోయాయి. ఘటనలో దాదాపు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. సహకార సంఘం ముందున్న మురికికాలువ సరిగ్గా లేకపోవడం.. చెత్తాచెదారం పేరుకుపోవడం.. నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వరద నీరు కార్యాలయంలోకి చేరిందని తెలుస్తోంది. డ్రైనేజీ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఘటన జరిగిందని అధికారులు అంటున్నారు.



తడిసిన ఎరువుల బస్తాలు

వైద్య విధాన పరిషత్ వైద్యులు అక్కడికే వెళ్లాలి

జగిత్యాల: వైద్య విధాన పరిషత్‌లోకి వచ్చే వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సులు వెంటనే అదే ఆస్పత్రులకు వెళ్లాలని కమిషనర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకేంద్రంలో జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాల ఏర్పడడంతో వైద్య విధాన పరిషత్ కోరుట్ల ఆస్పత్రి పరిధిలోకి వెళ్లింది. దీని పరిధిలో రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. ఇందులో పనిచేసే సిబ్బంది కొందరు మెడికల్ కళాశాల, మరికొందరు మాతాశిశు కేంద్రంలో పనిచేస్తున్నారు. నేషనల్ హెల్త్ స్కీం పరిధిలోని ముగ్గురు గైనకాలజిస్టులు, నలుగురు పిడియాట్రిక్‌లు, ఇద్దరు మత్తు డాక్టర్లు పనిచేస్తున్నారు. నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్, ఓపీ, ముగ్గురు ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్స్, ముగ్గురు స్వీపర్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, ఒక బయోమెట్రిక్ ఇంజినీర్ మెడికల్ కళాశాల పరిధిలో పనిచేస్తున్నారు. దీంతో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. వారంతా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు వెళ్లాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా ఆదేశాలు నిజమేనన్నారు.

విధుల్లో చేరిన డీఈవో

సాక్షి స్పందన



జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: డీఈవో జగన్మోహన్‌రెడ్డి విధుల్లో చేరారు. ఆయన 15 రోజులు సెలవుపై వెళ్లడంతో కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావును ఇన్‌చార్జిగా నియమించారు. సెలవు ముగిసినా జగన్మోహన్‌రెడ్డి రాకపోవడంతో 'సారొస్తారొస్తారా..!' శీర్షికన 'సాక్షి' మంగళవారం కథనాన్ని ప్రచురించింది. స్పందించిన డీఈవో విధుల్లో చేరారు.

ఓటరు జాబితా అప్‌డేట్‌కు ప్రణాళిక

- కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు
- ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్వోలు
- జిల్లాలో 7,12,710 మంది ఓటర్లు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో ఓటరు జాబితా అప్‌డేట్‌కు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నారు. దీంతో బూత్ లెవెల్ అధికారులు(బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రస్తుతమున్న ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి జాబితాలో ఉన్నవారు శాశ్వతంగా వేరే గ్రామానికి వెళ్లిపోయారా..? పేర్లలో ఏమైనా తప్పులున్నాయా..? వంటి వివరాలు తెలుసుకుంటున్నారు. జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరఖాస్తు తీసుకోనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

జిల్లాలో 7,12,710 మంది ఓటర్లు

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే జిల్లా పరిధిలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు పూర్తిగా.. వేములవాడ నియోజకవర్గంలో జిల్లాలోని కథలాపూర్, మేడిపెల్లి, భీమారం, చొప్పదండి నియోజకవర్గంలో మల్యాల, కొడిమ్యాల మండలాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 7,12,710 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,42,216 మంది, మహిళలు 3,70,460 మంది ఉన్నారు. వీరి కోసం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 930 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.



ఓటరు జాబితా సర్వే చేస్తున్న బీఎల్వో (ఫైల్)


షెడ్యూల్ ఇదే..

- ఓటరు జాబితా తయారీ కోసం ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి జాబితాను పరిశీలిస్తారు.
- మృతి చెందిన, వలస వెళ్లినవారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు.
- అక్టోబర్ 29న ఓటరు జాబితాను ప్రకటిస్తారు.
- ఆ జాబితాపై అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- అభ్యంతరాలపై మరోసారి బీఎల్వోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి డిసెంబర్ 24లోగా పరిష్కరిస్తారు.
- కొత్త ఓటరు జాబితాను ముద్రించి వచ్చే ఏడాది జనవరి 6న ప్రకటిస్తారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు

ఓటరు జాబితా నవీకరణలో భాగంగా జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించనున్నారు. ఓటరు జాబితాను వారికి చూపించి అభిప్రాయాలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా అందరి సహకారం తీసుకుంటామని పేర్కొన్నారు.

అర్హులందరూ ఓటరుగా చేరాలి



ఓటరు జాబితా అప్‌డేట్ కోసం బీఎల్వోలు ఇంటింటా సర్వే చేస్తారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బూత్‌లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. మీ సేవా కేంద్రాలతోపాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వీలుంది.

– ఆనంద్‌కుమార్, కోరుట్ల ఆర్డీవో

ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించాలి

- వైద్యులు అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: రోగులకు ఇబ్బంది కలగకుండా సేవలందించాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో జీజీహెచ్, ఎంసీహెచ్ వైద్యులతో మంగళవారం సమావేశమయ్యారు. డిప్యూటేషన్‌పై ఎంతమంది డాక్టర్లున్నారని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సెలవులో ఉన్నప్పుడు మెడికల్ కళాశాల ప్రొఫెసర్లను ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు లేకుండా నర్స్‌లు ట్రీట్‌మెంట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ విధానం ఉంటే వైద్యులు విధులకు వస్తున్నారా..? లేదా..? తెలుస్తుందని, వెంటనే బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంసీహెచ్‌కు సంబంధించి వాట్సాప్ గ్రూప్ ఉందని, ఏరోజుకారోజు వైద్యుల షెడ్యూల్ గ్రూపులో ఉంటుందని, దాని ప్రకారం చెక్ చేస్తామని డాక్టర్లు కలెక్టర్‌కు వివరించారు. రోజుల తరబడి విధులకు హాజరుకాకుంటే వేతనం కట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమాచారం లేకుండా అందుబాటులోలేని వైద్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. బాలింతల కోసం ర్యాంప్ మాత్రమే ఉందని, లిఫ్ట్ లేదని, బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని వైద్యులు కలెక్టర్‌ను కోరారు. డీఎంహెచ్‌వో సమీయొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన కల్పించాలి

దోమల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. మున్సిపల్ కమిషనర్లు, డాక్టర్లతో సమావేశమయ్యారు. కమిషనర్లు నీటి సరఫరా, క్లోరినేషన్, మంచినీటి లీకేజీపై శ్రద్ధ చూపాలన్నారు. మెట్‌పల్లి జీఈ కేసుల నమోదుపై కారణాలు తెలుసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు, గౌతంరెడ్డి, కమిషనర్లు పాల్గొన్నారు.

ముసాయిదా రెవెన్యూ చట్టంపై అభిప్రాయ సేకరణ

ముసాయిదా రెవెన్యూ చట్టం–2024పై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 23న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. మేధావులు, రైతులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, ఆసక్తిగలవారు పాల్గొనాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమీప మీ సేవ కేంద్రాల్లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలన్నీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు.

రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు



కథలాపూర్: రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

- మెట్‌పల్లిలో జాతీయ రహదారిపై బైఠాయింపు
- కథలాపూర్‌లో ధర్నాకు దిగిన అన్నదాతలు
- అంబారిపేట రైతువేదిక ఎదుట ఆందోళన

మెట్‌పల్లి/కథలాపూర్/జగిత్యాల రూరల్: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం మెట్‌పల్లిలో రైతులు రోడ్డెక్కారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. రైతులందరికీ రూ.రెండులక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు షరతులు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాస్తారోకోతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు జోక్యం చేసుకుని రైతులను సముదాయించారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదలబోమని భీష్మించుకూర్చున్నారు. జిల్లా వ్యవసాయాధికారి వాణి రావడంతో ఆమెకు వినతిపత్రం ఇచ్చి ఆందోళన విరమించారు.

రుణమాఫీ పేరిట రైతుల మోసం: మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

రైతులను రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి మండిపడ్డారు. కథలాపూర్‌లో రైతులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. పాలన చేతకుంటే గద్దె దిగాలని, రైతులను మోసం చేయొద్దని సూచించారు. దేవుళ్లపై ప్రమాణం చేసిన సీఎం రేవంత్.. ఇప్పుడేం చెబుతారని ప్రశ్నించారు. రైతులను రోడ్డుమీదకు తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ ముంతాజిబొద్దిన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వినోద్‌కుమార్, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సైలు నవీన్‌కుమార్, శ్యాంరాజు, శ్వేత బందోబస్తు నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు బొడ్డు బాలు, కల్లెడ శంకర్, కొండ ఆంజనేయులు, బద్దం మహేందర్, మల్యాల రమేశ్, శీలం మోహన్‌రెడ్డి, ఎం.డీ రఫీ, తీట్ల శంకర్, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలలో రైతువేదిక ఎదుట ధర్నా

రుణమాఫీ అర్హులైన రైతులందరికీ అందలేదంటూ జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతువేదిక వద్ద రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం వెంటనే రీసర్వే నిర్వహించి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ పోలీసులు రుణమాఫీ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



మెట్‌పల్లి: రహదారిపై బైఠాయించిన రైతులు



జగిత్యాల రూరల్: అంబారిపేటలో రైతుల ధర్నా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్ : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణ పరిసరాలను వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ముత్యంపేటలో డెంగీ సోకిన వారి ఇళ్లను సందర్శించి బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రజలు ఆరోగ్యసూత్రాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. దోమల నివారణకు డ్రైనేజీల్లో మందు చల్లించాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ, వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, హెచ్‌ఈవో వేణురావు, పీహెచ్‌ఎన్ ఇందిర, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ఫార్మసిస్ట్ మహేశ్వరి, ల్యాబ్ అసిస్టెంట్ ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ సుమ, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రైతులందరికీ రుణమాఫీ

మల్యాల: రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని డీఏవో వాణి అన్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం అనంతరం ఆమె రైతులతో మాట్లాడారు. వ్యవసాయ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకస్తున్నారని, వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఏవో చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్య, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదు రోజుల్లో జిల్లాకు మోస్తరు వర్ష సూచన ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 35 డిగ్రీల సెల్సియస్‌గా.. రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 25 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

కవి, రచయిత ముత్యం మృతి

కరీంనగర్ కల్చరల్: కవి, రచయిత, పరిశోధకుడు, శాతవాహన విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యుడు, కరీంనగర్‌కు చెందిన డాక్టర్ ముత్యం అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతిచెందారు. విద్యార్థి దశలో పీడీఎస్‌యూ నిర్మాణానికి కృషి చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రెసిడెంట్‌గా, ఉస్మానియా రైటర్స్ సర్కిల్ స్థాపనలో క్రియాశీలకంగా పని చేశారు. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యంపై పరిశోధన జరిపారు. ఎన్నో పరిశోధన గ్రంథాలు వెలువరించారు. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్య సిద్ధాంత వ్యాసం, సునాముది జీవధార, నేను చిందు ఎల్లమ్మను, ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర, బంకుపల్లి మల్లయ్య శాస్త్రి జీవిత దృశ్యం తదితర పుస్తకాలు రచించారు. ఆయన మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని కవి, రచయిత కూకట్ల తిరుపతి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు సి.కుమార్, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, బాధ్యులు విలాసాగరం రవీందర్, పెనుగొండ బసవేశ్వర్, సరసిజ సంతాపం ప్రకటించారు.

బస్‌షెల్టర్‌లో అనాథ వృద్ధురాలు..



అంతిమ సంస్కారాలు చేస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల మానేరు క్యాంపు బస్‌షెల్టర్‌లో రెండేళ్లుగా నివాసం ఉంటున్న ఓ అనాథ వృద్ధురాలు(70) అందులోనే మృతి చెందింది. మంగళవారం స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామ్మోహన్, మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, గ్రామస్తులు లచ్చయ్య, నర్సింలు, రాజు, అనిల్ తదితరులు కలిసి, ఆమె మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్..



నారాయణ (ఫైల్)

బుగ్గారం(ధర్మపురి): గోపులాపూర్ మాజీ సర్పంచ్ కొమ్మినేని నారాయణ (65) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయన భార్య సుశీల గత ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. నారాయణ గ్రామంలో మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నారాయణ మృతికి పలువురు రాజకీయ నాయకులు, మండల వాసులు సంతాపం వ్యక్తం చేశారు.

రాఖీ ఆదాయం రూ.66 లక్షలు

- గోదావరిఖని డిపోకు అగ్రస్థానం

గోదావరిఖనిటౌన్(రామగుండం): రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులను తరలించి, అధిక ఆదాయం సమకూర్చుకున్న గోదావరిఖని ఆర్టీసీ డిపో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని మొత్తం 97 డిపోలతో పోల్చితే ఈ డిపో పరిధిలో బస్సులు సోమవారం అత్యధికంగా 76,383 కిలోమీటర్లు తిరిగాయి. ఈ ఒక్కరోజే రూ.66,55,090 ఆదాయం ఆర్జించిందని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఎండీ అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

పరిహారంపై అన్నదాతల్లో ఆందోళన

- 'బైపాస్' భూముల సేకరణపై అధికారుల కసరత్తు
- వివరాలు తెలపాలంటూ రైతులకు నోటీసులు
- బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని విజ్ఞప్తి



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యవసాయ భూమి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన పెద్ద గంగారెడ్డి కుటుంబానిది. వారికి ఇక్కడ ఉన్న 32 గుంటల భూమిని జాతీయ రహదారి -63 విస్తరణలో భాగంగా బైపాస్ నిర్మాణంలో కోల్పోతున్నారు. మెట్‌పల్లి పట్టణం నుంచి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఈ భూమి ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ గుంటకు రూ.20లక్షల ధర పలుకుతోంది. అంటే మొత్తం భూమి విలువ రూ.6కోట్లపైనే. కానీ ప్రభుత్వం అంత ధర చెల్లించే అవకాశం లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతామని గంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా ఈ ఒక్క రైతే కాదు.. ప్రభుత్వం చెల్లించే పరిహారంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో వందలాది మంది రైతులు దిగులు చెందుతున్నారు.

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-63) విస్తరణలో భాగంగా చేపట్టే బైపాస్‌ల నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల వారీగా సేకరించే భూములకు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తి చేసి హద్దులు ఏర్పాటు చేశారు. తాజాగా ఆయా భూములకు సంబంధించిన హక్కు పత్రాల నకళ్లు, ఇతర వివరాలు తెలపాలంటూ నోటీసులు ఇచ్చారు.

రెండు డివిజన్లలో 304 ఎకరాలు..

- మెట్‌పల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో బైపాస్ నిర్మాణానికి 304 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు.
- జిల్లాలో బైపాస్ రహదారి మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని మేడిపల్లి(పడమర) నుంచి మొదలవుతోంది. అక్కడి నుంచి బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది, పెద్దాపూర్ మీదుగా కోరుట్ల డివిజన్ పరిధిలోని యెఖీన్‌పూర్, సంగెం, వెంకటాపూర్, గుమ్లాపూర్, మోహన్‌రావుపేట, మేడిపల్లి(తూర్పు) వరకు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించారు.
- మెట్‌పల్లి డివిజన్‌లో 14 కిలోమీటర్లకు గాను 144 ఎకరాలు.. కోరుట్ల డివిజన్‌లో 16 కిలోమీటర్లకు గాను 160 ఎకరాలు సేకరించేలా ఏర్పాట్లు చేశారు.

రైతులకు నోటీసులు

- బైపాస్ కోసం అవసరమైన భూములను స్వాధీనం చేసుకోవడానికి జాతీయ రహదారుల చట్టం కింద గత మార్చిలో ప్రకటన జారీ చేశారు.
- దీనిని అనుసరించి ఆయా భూముల హక్కు పత్రాలు సమర్పించాలని, ఆశిస్తున్న పరిహారం, ఇతర వివరాలు తెలపాలని రైతుల వారీగా నోటీసులు ఇచ్చారు.
- ఈనెల 9తేదీ వరకు గడువు ఇవ్వగా.. దాదాపు రైతులందరూ అధికారులు సూచించిన వివరాలను అందించారు. ముఖ్యంగా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరల మేరకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

నష్ట పరిహారంపై ఇంకా రాని స్పష్టత..

- తమ భూములకు ఎంత నష్ట పరిహారం కావాలన్న దానిపై రైతుల నుంచి వివరాలు తీసుకున్న అధికారులు.. దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకపోనున్నారు.
- ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వ్యవసాయ భూముల ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం మాత్రం ఆ మేరకు ధరలు చెల్లించే అవకాశం లేదని అధికారులు అంటున్నారు.
- కొందరి రైతుల భూముల విలువ రూ.కోట్లల్లో ఉంది. కానీ పరిహారం రూ.లక్షల్లో మాత్రమే చెల్లించే అవకాశం ఉండడంతో భారీగా నష్టపోతామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మరికొందరు ఉన్న సాగు భూమంతా కోల్పోతున్నామని, దీనివల్ల ఉపాధి లేక కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోతున్నారు. ఏదేమైనా ప్రభుత్వం తమకు నష్టం జరగకుండా పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మార్కెట్ ధర ఇవ్వకుంటే నష్టపోతాం



మాకు మెట్‌పల్లి-వెల్లుల్ల ప్రధార రహదారి పక్కన విలువైన భూమి ఉంది. ఇదంతా బైపాస్ నిర్మాణంలో పోతుంది. ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించాలి. లేకుంటే బాగా నష్టపోతాం. – చిన్న గంగారెడ్డి, వెల్లుల్ల

ఆందోళనలు చేస్తాం



బైపాస్ నిర్మాణానికి భూములు ఇచ్చే రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. విలువైన భూములను కోల్పోతున్నాం. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతులు ఆశించిన ధరను చెల్లించాలి. లేనిపక్షంలో సంఘటితంగా ఆందోళనలు చేస్తాం. – మారు మురళి, వెల్లుల్ల

కేటీఆర్, హరీశ్‌రావు తోడుదొంగలు

- అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతున్నారు..
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సాక్షి, పెద్దపల్లి: మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తోడుదొంగలని, అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రైతు రుణమాఫీపై ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మొద్దన్నారు. పెద్దపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో చిన్న చిన్న పొరపాట్లు, సాంకేతిక కారణాలతో ఇంకా కొంతమందికి రుణమాఫీ కాలేదని తెలిపారు. రైతు వేదికల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామని, ఈ నెలాఖరు వరకు ఫిర్యాదులు స్వీకరించి, అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామన్నారు. బ్యాంకుల్లో తలెత్తిన సమస్యలను సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 4 విడతల్లో చేసిన అరకొర రుణమాఫీ బ్యాంకుల్లో వడ్డీలకే సరిపోలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువచ్చి, రైతుల ప్రాణాలను బలి తీసుకుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ ఒక్క రాష్ట్రంలోనూ రుణమాఫీ చేయలేదన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 27,471 మంది రైతులకు రూ.192.95 కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నయ్య గౌడ్, సారయ్య గౌడ్, నూగిల్ల మల్లయ్య, మస్రత్, అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి



ప్రశంసాపత్రాలు అందించిన నరేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-16 బాలుర విభాగం పోటీల్లో పాఠశాలకు చెందిన అశ్విన్, రాఘువేంద్ర, సిద్ధార్థ్, మోహనిష్, మోట్వాని శరణ్, రణధీర్, ముగ్గా, సనికితి, జస్లిన్, పూజిత చౌదరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారిని అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అద్భుతంగా రాణించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో రెండు రోజులు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ టీచర్స్ రీ-క్వెస్ట్ నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, 42 మంది ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ కెప్టెన్ బి.మధుసూదన్ రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట మళ్లీ బైఠాయింపు

- ఠాణాలో సమస్య పరిష్కారం కాలేదని బాధితురాలి నిరసన



భర్త ఇంటి ఎదుట బైఠాయించిన శిరీష

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం కేశవపట్నంలోని భర్త ప్రవీణ్ ఇంటి ఎదుట భార్య శిరీష మళ్లీ బైఠాయించింది. ఠాణాలో తన సమస్య పరిష్కారం కాలేదంటూ నిరసన తెలిపింది. కూతురు పుట్టాక తన భర్త బ్యాంక్‌లో వేస్తానని రూ.2 లక్షలు తీసుకొని, వేయలేదని, అదనపు కట్నం కోసం వేధించడంతో 2018 నుంచి తిమ్మాపూర్ మండలం నల్లగొండలోని పుట్టింట్లో ఉంటున్నానని, అతను మరో స్త్రీతో సహజీవనం చేస్తున్నాడంటూ వారం రోజుల క్రితం శిరీష భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాలేదంటూ మంగళవారం కూతురితో కలిసి భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. అత్తింటివారితో గొడవ పడగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరణ కోరగా కౌన్సెలింగ్ చేసినా వినకపోవడంతో కోర్టును ఆశ్రయించాలని శిరీషకు సూచించినట్లు పేర్కొన్నారు.

రాజన్న సేవలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్



చైర్‌పర్సన్ శారదకు స్వాగతం పలుకుతున్న ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు

వేములవాడ: ఎములాడ రాజన్నను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం స్వామివారికి పూజలు చేశారు.

కొండగట్టులో...

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు, ప్రధాన అర్చకులు ఆశీర్వాదం అందించారు.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

- తప్పిన పెను ప్రమాదం
- ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

రామగుండం: ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం గోదావరిఖని వెళ్తోంది. అదే సమయంలో ఆయిల్ ట్యాంకర్ కుందనపల్లి ఎక్స్‌రోడ్ వద్ద యూటర్న్ తీసుకుంటోంది. బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసినా అతివేగం కారణంగా ట్యాంకర్‌ను ఢీకొట్టి, నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బస్సులో మొత్తం 20 మంది ఉన్నారని, మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టి, స్వస్థలాలకు వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అంతర్గాం ఎస్సై వెంకటస్వామి సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్యాంకర్ బంపర్ వంగిపోగా, బస్సు ధ్వంసమైంది. ట్యాంకర్ పేలిపోయి ఇంధనం బయటకు వస్తే మంటలు అంటుకొని, భారీ అగ్ని ప్రమాదం జరిగేదని వాహనదారులు పేర్కొన్నారు.

వంతెనపై ఒరిగిన టిప్పర్

- నిలిచిన వాహనాల రాకపోకలు



రామడుగు(చొప్పదండి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పాత వంతెనపై మంగళవారం మధ్యాహ్నం లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్ కారుకు సైడ్ ఇవ్వడంతో పక్కకు ఒరిగింది. దీంతో కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట, గోపాల్‌రావుపేట నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

దొరికిన బంగారు కడియం అప్పగింత



కడియం అందిస్తున్న శంకరయ్య

రామగిరి(మంథని): మండలంలోని రత్నాపూర్‌కు చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు కట్కూరి శంకరయ్య తనకు దొరికిన బంగారు కడియాన్ని బాధితురాలికి అప్పగించి, నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. రత్నాపూర్‌కు చెందిన శంకరయ్య సెంటనరీకాలనీలోని శ్రీకోదండ రామాలయంలో సేవకుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఆలయం నుంచి ఇంటికి వెళ్తుండగా పన్నూర్ చౌరస్తా వద్ద సుమారు రూ.80 వేల విలువైన బంగారు కడియం దొరికింది. కాసేపటికే దాన్ని వెతుక్కుంటూ బాధితురాలు వచ్చింది. గమనించిన ముత్తారానికి చెందిన గుడికందుల విజ్జిన్న రత్నాపూర్‌కు చెందిన శంకరయ్యకు దొరికిందని చెప్పాడు. అనంతరం ఆమె తన బంధువులతో కలిసి అతని ఇంటికి వెళ్లింది. శంకరయ్య పూర్తి వివరాలు తెలుసుకొని, బంగారు కడియాన్ని ఆమెకు అందజేశారు. దీంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే ఇంట్లో రెండోసారి చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

జమ్మికుంట(హుజూరాబాద్): తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రెండోసారి చోరీకి పాల్పడ్డారు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు బుడ్డ గిర్ని ఎదురుగా ఉన్న గుడివాడ సుధాకర్ ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి తన తల్లి అస్తికలను కాశీలో కలిపేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి చొరబడ్డారు. ఉదయం తాళం పగిలి ఉండటాన్ని గమనించిన సుధాకర్ బంధువు మునిగాల అనిల్ 100కు ఫోన్ చేశాడు. పోలీసులు, క్లూస్ టీం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుధాకర్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. అతను ఇంట్లో రూ.3 వేలు, సెల్‌ఫోన్ ఎక్కడ ఉన్నాయో చెప్పాడు. వారు సంబంధిత స్థలంలో చూడగా అవి కనిపించలేదు. అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, సుధాకర్ తల్లిదండ్రులది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు. సుమారు 50 ఏళ్ల క్రితం వారు బతుకుదెరువు కోసం జమ్మికుంట వచ్చారు. ఈ కుటుంబం పట్టణంలో బజ్జీల బండి నడిపిస్తూ జీవనోపాధి పొందుతోంది. 2023 ఏప్రిల్‌లో వీరు స్వగ్రామం గుంటూరు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో దొంగలు పడి, నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఒకే ఇంట్లో రెండుసార్లు దొంగతనం జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అప్పుల బాధతో వలసజీవి ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ వలసజీవి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన వేముల మల్లేశం(40) 8 నెలల క్రితం అప్పు చేసి, మస్కట్ వెళ్లాడు. అక్కడ సరైన ఉపాధి, వేతనం లభించక స్వగ్రామానికి తిరిగివచ్చాడు. ఇక్కడ నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. కూలీ పనులు చేస్తూ భార్య, ముగ్గురు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే, మస్కట్‌కు వెళ్లేందుకు, కుటుంబాన్ని పోషించేందుకు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో భార్య సోమవారం రాఖీ పండుగకు పుట్టింటికి వెళ్లింది. మంగళవారం మల్లేశం ఇద్దరు కుమారులు, కూతురిని పాఠశాలకు పంపించాడు. అతని తండ్రి చెంచయ్య పొలం పనులకు వెళ్లగానే ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన చెంచయ్య తలుపు గడియపెట్టి ఉండటంతో కిటికీలో నుంచి చూడగా మల్లేశం ఉరేసుకొని కనిపించాడు. దీంతో ఆయన రోదిస్తూ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, తలుపులు బద్దలుకొట్టి చూడగా మల్లేశం అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారంలో పిచ్చికుక్క దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు సూర సమాన్విత్ ఇంటి సమీపంలోని కిరాణం దుకాణానికి వెళ్తుండగా కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. స్థానికులు అతడిని జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన కాసేపటికి అదే కుక్క గ్రామానికి చెందిన సపాయి నగేష్ అనే మరో వ్యక్తిని కరవడంతో అతనికీ గాయాలయ్యాయి. అతడిని కూడా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి చాక్లెట్స్ విక్రేత అరెస్టు

పెద్దపల్లి రూరల్: గంజాయి చాక్లెట్స్ విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో తిలక్‌నగర్‌కు చెందిన టక్‌రాజు గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్నాడు. అతన్ని పట్టుకొని, రూ.5,720 విలువైన 280 గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్ పేర్కొన్నారు.

విద్యుత్ సర్వీస్ వైరు దొంగ..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో వట్టెల రాజుకు చెందిన బోర్ మోటార్ విద్యుత్ సర్వీస్ వైరును దొంగలించిన ఇదే గ్రామానికి చెందిన కుంచం పర్శరాములును అరెస్టు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ నెల 13న 20 మీటర్ల సర్వీస్ వైరును పర్శరాములు దొంగలించడం చూసి, రాజు ఫిర్యాదు చేశాడన్నారు. ఆ వైరు ద్వారా అతను వాగులో చేపలు పడుతున్నాడని తెలిపారు. వైరును ఇవ్వాలని రాజు అడగగా చంపుతానని బెదిరించాడన్నారు. పర్శరాములను మంగళవారం అరెస్టు చేశామన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): వీధి కుక్కల దాడిలో ఓ దూడ మృతిచెందిన ఘటన తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. చిందం రాజు నిత్యం పశువులను తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో కట్టేస్తున్నాడు. సోమవారం సాయంత్రం కూడా కట్టేసి, ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి కుక్కల గుంపు వచ్చి, దూడపై దాడి చేసి, చంపేశాయి. మెలకువ వచ్చిన రాజు వెంటనే కర్ర పట్టుకొని, కుక్కలను తరిమికొట్టాడు. లేకపోతే అవి మిగతా జీవాలనూ చంపేసేవని కంటతడి తెలిపాడు. ఈ ఘటనతో తనకు రూ.20 వేల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

50 టీఎంసీలకు ఎస్సారెస్పీ నీటిమట్టం



జగిత్యాల అగ్రికల్చర్: ఎస్సారెస్పీ క్రమంగా నిండుతోంది. మంగళవారం సాయంత్రంవరకు ప్రాజెక్టు నీటిమట్టం 50.388 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 11,240 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కాకతీయ ప్రధాన కాలువకు 3700 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

వేములవాడ ఎఫ్‌బీవోకు అస్వస్థత

- రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజన్ అవడమే కారణమన్న అధికారి

కరీంనగర్ అర్బన్: హోటల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా తాను అస్వస్థతకు గురయ్యానని ఓ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(ఎఫ్‌బీవో) తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడలో ఎఫ్‌బీవోగా విధులు నిర్వహించే బాలకృష్ణ ఆఫీస్ పనిమీద మంగళవారం కరీంనగర్ జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి వచ్చారు. మధ్యాహ్నం కావడంతో భోజనం చేసేందుకు బస్టాండ్ సమీపంలోని రెస్టారెంట్‌కు వెళ్లారు. టమాటా సూప్, మష్రూం మసాలా విత్ రోటీ ఆర్డర్ చేశారు. పూర్తిగా తినకముందే కడుపునొప్పి రావడంతో రెండుసార్లు వాంతులు చేసుకున్నారు. రెస్టారెంట్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లగా వారు దురుసుగా ప్రవర్తించారు. నీ దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరించారు. నాసిరకం, నిల్వ చేసిన ఆహారం వల్లే అస్వస్థతకు గురయ్యానని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదని ఆయన ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో ఎవరూ లేరన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ విషయమై రెస్టారెంట్ మేనేజ్‌మెంట్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయంలో స్వామివారికి మొక్కుతున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ సునీల్, అధికారులు అశోక్, ఉమామహేశ్వర్ పర్యవేక్షించారు.